లాభాలు పూయిస్తున్న మల్లెలు



తిమ్మాపురంలో మల్లె పూలు కోస్తున్న కూలీలు



పుత్తూరులో సాగైన మల్లె తోట

- పుత్తూరు ప్రాంతంలో అధికంగా పూలతోటల సాగు
- మార్కెట్‌లో తప్పని దళారుల బెడద
- నష్టపోతున్న అన్నదాతలు

పుత్తూరు: పుత్తూరు ప్రాంత రైతులకు మల్లెలు లాభాలు పూయిస్తున్నాయి. మల్లెసాగు లాభదాయకంగా ఉండడంతో ఈ తోటలపై రైతులు దృష్టి సారిస్తున్నారు. అధిక పెట్టుబడుల అవసరం లేకుండా ఏడాదిలో ఏడెనిమిది నెలల పాటు నిరంతరం ఆదాయాన్ని అందిస్తున్న ఈ మల్లెతోటలు పుత్తూరు మండలంలో ఏటా విస్తరిస్తున్నాయి. కొత్తగా సాగు చేసిన తోట ఓసారి పూతకు వస్తే పదేళ్ల పాటు స్థిరమైన దిగుబడిని ఇస్తుందని పూల రైతులు చెబుతున్నారు. ఎకరా విస్తీర్ణంలో 1600 మొక్కలను పెంచవచ్చు. తొలుత గుంతలు తవ్వి ఒక్కో గుంతలో రెండేసి మొక్కలను నాటాలి. మొక్కలు నాటిన తర్వాత తగిన మోతాదులో



లాభాలు పూయిస్తున్న మల్లెలు

ఎరువు వేయాలి. మొక్కలకు అంటుకట్టిన ఏడాదిన్నర తర్వాత మొగ్గలు వస్తాయి. మొగ్గలు వచ్చే సమయంలో మందులు పిచికారీ చేయాలి. ఇందుకు ఎకరాకు రూ.16 వేలు వరకు ఖర్చు అవుతుంది. పూలు పూయడం మొదలైన తర్వాత పదేళ్ల పాటు మంచి దిగుబడి ఉంటుంది. ఈ తోటలకు వారానికి ఒకసారి నీరుకడితే సరిపోతుంది. వర్షాభావ పరిస్థితులు, విద్యుత్ కోతల వంటి సమస్యలు ఉన్నా మల్లె రైతులు ధీమాగానే ఉంటారు. మల్లెపూల సీజన్ మార్చి నెలతో మొదలై అక్టోబర్ వరకు ఉంటుంది. మల్లెలు మాత్రం ఏప్రిల్ చివరి వారం నుంచి పూయడం మొదలవుతాయి. తొలి మూడు మాసాల్లో ఒక కేజీ రూ.300 నుంచి రూ.500 వరకు ధర పలుకుతుంది. పూలు కోయడానికి వచ్చే కూలీలకు కేజీకి రూ.20 చెల్లిస్తుంటారు. పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని భవానీనగర్, తిమ్మాపురం, పిళ్లారిపట్టు, కల్యాణపురం, వినాయకపురం ప్రాంతాల్లో మల్లె తోటలను విస్తారంగా సాగు చేస్తున్నారు. అయితే తాము పండించిన పూలకు తామే ధర నిర్ణయించే స్థితిలో లేకపోవడం పట్ల పూల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తప్పని దళారుల దోపిడీ..

అన్ని మార్కెట్లకు ఉన్నట్లే పూల మార్కెట్‌లోనూ దళారుల దోపిడీ తప్పడం లేదు. పుత్తూరు పట్టణంలో ముగ్గురు పూల వ్యాపారులు ఉన్నారు. వీరు పల్లెల్లోని తోటల వద్దకు తమ సిబ్బందిని పంపించి అక్కడే తూకం వేసి పూలు కొనుగోలు చేస్తారు. ఆ సమయంలో రైతుకు ధరను చెప్పకుండా, ఒక పుస్తకంలో ఎన్ని కేజీలు కొనుగోలు చేశారో నమోదు చేస్తారు. నెలకు ఒకసారి మొత్తం కేజీలకు డబ్బు చెల్లిస్తారు. మల్లె సీజన్ మొదలైన తొలి మూడు మాసాల్లో మంచి ధర ఉన్నా, రైతులకు మాత్రం నామమాత్రపు ధరను చెల్లిస్తుండడంతో రైతులు దారుణంగా నష్టపోతున్నారు. ఈ దళారులు మాత్రం సిండికేట్‌గా ఏర్పడి అధిక ధరలు నిర్ణయించి వినియోగదారులకు విక్రయిస్తూ లాభాలు దండుకుంటున్నారు. ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ వ్యవస్థను సమూలంగా రూపుమాపి పూల రైతులకు తగిన గిట్టుబాటు ధర దక్కేలా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

గంగమ్మ జాతర రేపు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం విరాటపురం రోడ్డు పక్కన ఉన్న గంగమ్మ ఆలయంలో మంగళవారం గంగమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఓ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆలయంలో అమ్మవారికి అంబలి పోసి ప్రసాదాలను నైవేద్యంగా సమర్పిస్తారని, అదేవిధంగా మంగళవారం అంగరంగ వైభవంగా అమ్మవారికి పూజలు నిర్వహించి ఊరేగింపు ఉంటుందన్నారు. జాతరకు సంబంధించి భారీ ఎత్తున ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

23 నుంచి సబ్సిడీ విత్తనకాయల పంపిణీ

పెనుమూరు(కార్వేటినగరం): రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ వేరుశనగ విత్తన కాయల పంపిణీ ప్రక్రియను ఈ నెల 23 నుంచి ప్రారంభిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి కల్యాణ్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్సిడీ విత్తనకాయలు కావలసిన రైతులు స్వయంగా స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో పట్టాదారు పాసుపుస్తకం, 1బి, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో తప్పక రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. విత్తన పంపిణీ ప్రక్రియ ఈ నెల 23 నుంచి రైతు భరోసా కేంద్రాల్లో ప్రారంభిస్తున్నట్లు సూచించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి



వీరాస్వామి మృతదేహం

నగరి: రూరల్ మండలంలోని కావేటిపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంపీటీసీ చంద్రారెడ్డికి వరుసకు సోదరుడైన డి.వీరాస్వామి విద్యుత్ ప్రమాదంలో మృతిచెందారు. ఆదివారం చినుకులు పడుతున్న సమయంలో పొలంవద్దకు వెళ్లి మోటారు స్విచ్ వేయడానికి ప్రయత్నించిన సమయంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. స్థానికంగా ఉన్న రైతులు గుర్తించి ఆస్పత్రికి చేర్చేలోపు మృతిచెందాడు. దీంతో కావేటిపురం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఇడుపులపాయలో వైఎస్సార్‌కు నివాళి



వైఎస్సార్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, గ్రామస్తులు

శ్రీరంగరాజపురం: ఉమ్మడి రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డికి శ్రీరంగరాజపురం మండలం వెంకటాపురం సర్పంచ్ విజయ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఇడుపులపాయలోని వైఎస్సార్ సమాధి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయ మాట్లాడుతూ ఏటా ఇడుపులపాయలో వైఎస్సార్ సమాధి వద్ద నివాళులర్పించడానికి గ్రామ ప్రజలతో కలసి వస్తున్నామని తెలిపారు. వైఎస్సార్ పాలన, మహానేత అందించిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని వైఎస్సార్ సేవలను కొనియాడారు. రానున్న ఎన్నికల ఫలితాల్లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సీఎంగా గెలవాలని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ఏసమ్మ, నాయకులు గోవిందయ్య, శీనయ్య, రమేష్, చిరంజీవి పాల్గొన్నారు.

నేడు ప్రదోష పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం ప్రదోష కాల పూజలు జరుగుతాయని ఆలయ అర్చకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శివుడికి నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహిస్తారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేపట్టనున్నారు. ప్రదోష పూజలనంతరం భక్తులకు దర్శన భాగ్యం కలిపించి తీర్థప్రసాదాలు అందజేస్తారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేపట్టనున్నారు.

లక్ష్మమ్మకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న గ్రామస్తులు

నింద్ర: మండల కేంద్రమైన నింద్రలో ఆదివారం గ్రామ దేవత లక్ష్మమ్మకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో గంగమ్మ జాతర సందర్భంగా గ్రామ దేవతలకు ముందుగా పొంగళ్లు పెట్టి పూజలు చేసిన తరువాత గంగమ్మ జాతర చేయడం ఆనవాయితీ సందర్భంగా లక్ష్మమ్మకు గ్రామంలోని ప్రజలు పొంగళ్లు పెట్టారు. అనంతరం గెరిగెను గ్రామంలో ఊరేగించారు.

ఆకట్టుకున్న దుర్యోధన వధ



దుర్యోధన వధను తిలకించడానికి వచ్చిన జనసందోహం



దుర్యోధనున్ని వధిస్తున్న భీమసేనుడు

పాలసముద్రం: మండలంలోని గంగమాంబపురం, ఆముదాల గ్రామాల్లో ధర్మరాజులస్వామి మహాభారత ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం జరిగిన భీమ, దుర్యోధనుడి యుద్ధ సన్నివేశం ఆద్యంతం ఆకట్టుకుంది. వేణుగోపాల నాట్యబృందంలో భీమసేనుడిగా గోవిందరాజు, దుర్యోధనుడిగా భాస్కర్‌రెడ్డి కురుక్షేత్ర యుద్ధం ముగింపు సన్నివేశం ఆకట్టుకుంది. సర్వం కోల్పోయిన దుర్యోధనుడు అస్త్రసన్యాసం చేసి గంగలో తపస్సుకు వెళ్లగా, భీమసేనుడు రెచ్చగొట్టి యుద్ధానికి ప్రేరేపించే సన్నివేశం ఆద్యంతం ప్రజలను ఆకట్టుకుంది. దుర్యోధనున్ని వధించే సన్నివేశాన్ని తిలకించడానికి మండల పరిధిలోని ప్రజలతో పాటు తమిళనాడు ప్రజలు వందలాదికి పైగా తరలివచ్చారు. మహాభారత ఉత్సవాల సందర్భంగా గ్రామాల్లో సందడి నెలకొంది.

ఆదర్శప్రాయుడు పుచ్చలపల్లి సుందరయ్య



పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సమాచార హక్కుల వేదిక సభ్యులు

పుత్తూరు: బడుగు, బలహీన వర్గాల కోసం అహర్నిశలు పోరాటం చేసిన పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శప్రాయుడని సమాచార హక్కుల వేదిక సంఘం కార్యదర్శి వర్గ సభ్యురాలు హేమలత అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య నగర్‌లో కమ్యూనిస్టు ఉద్యమ పితామహుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి కె.మురగారెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల పక్షాన పోరాటం చేసిన సుందరయ్య సీపీఎం పార్టీ ఏర్పాటులో ప్రధాన భూమిక పోషించారన్నారు. ఆయన చొరవ, తెగువతోనే భారత కమ్యూనిస్టు (మార్కిస్ట్) పార్టీ ఏర్పాటైందన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా అన్ని కార్మిక సంఘాలు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు రామ్మూర్తి, మానస, బాబు, జ్యోతి భారతి, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. ద్రౌపదీదేవి కల్యాణం





ద్రౌపదీ, ధర్మరాజుల స్వామివారి కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు, కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కార్వేటినగరం: మండల పరిధిలోని కత్తెరపల్లిలో గత ఐదు రోజులుగా జరుగుతున్న మహాభారత వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీద్రౌపదీ, ధర్మరాజుల స్వామివారి కల్యాణాన్ని వేదపండితులు వేద మంత్రాల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహంతో పాటు పంచ పాండవులు, శ్రీకృష్ణుని ఉత్సవ మూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. దీంతో మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి వడిబాల సమర్పించుకున్నారు. అలాగే ఇంటింటా కర్పూర హారతులు పట్టారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపైకి అమ్మవారిని వేంచేపు చేసి ధర్మరాజుల స్వామి వారితో కల్యాణోత్సవం నిర్వహించారు. వేద పండితులు మంత్రాలు పఠిస్తూ ముత్యాల తలంబ్రాలు పోసి, కనుల విందుగా కల్యాణం జరిపించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కల్యాణోత్సవంలో దంపతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ధనగిరిరెడ్డి, బాబురెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గురువులకు సన్మానం



పూర్వ గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1982–83వ సంవత్సరంలో 10వ తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. గురువులు సుబ్రహ్మణ్యం, లలిత, శారద, శకుంతల తదితరులను దుశ్శాలువ పూలమాలతో పాటు పట్టువస్త్రాలు అందజేసి గురువుల నుంచి ఆశీర్వచనం పొందారు. గంగాధర నెల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గడచిన విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్ పదో తరగతి విద్యార్థిని విద్యార్థులకు సైతం విద్యాసామగ్రిని అందజేశారు. రానున్న విద్యా సంవత్సరంలో గంగాధర నెల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మెరుగైన వసతుల కోసం చేయూత అందిస్తున్నట్లు పూర్వ విద్యార్థులు ప్రభాకర్ రెడ్డి, లోకనాథరెడ్డి, చంద్రన్, నిత్యానందనాయుడు, రవీంద్రనాయుడు, జయచంద్ర నాయుడు, రెడ్డెప్పరెడ్డి, జగన్ బాబు, ఉషశ్రీ, భారతి, కల్యాణి, పప్పీ, కస్తూరితో పాటు పలువురు కార్యక్రమంలో పాల్గొని హైస్కూల్ అభివృద్ధికి, ఏటా విద్యార్థులకు చేయూత అందిస్తామన్నారు.

భక్తి చైతన్య సంబరం

- వేడుకగా గంగమ్మ శోభాయాత్ర
- జానపద కళారూపాలు, వేషాలతో హోరెత్తిన పురవీధులు

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా ఆదివారం సాయంత్రం తిరునగరిలో చేపట్టిన గంగమ్మ భక్తి చైతన్య శోభాయాత్ర సంబరం అంబరాన్నంటింది. సాంప్రదాయబద్ధంగా గంగ జాతరలో భక్తులు వేసే వేషాలను ఆవిష్కరిస్తూ ఎంతో ప్రాచీన చరిత్ర కలిగిన గంగమ్మ జాతరకు పూర్వ వైభవం కల్పించాలనే సంకల్పంతో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సారథ్యంలో భక్తి చైతన్య యాత్ర అంగరంగవైభవంగా చేపట్టారు. అనంతవీధికి ఉన్న ప్రాశస్త్యాన్ని దృష్టిలో ఉంచుకొని అక్కడి నుంచి ఈ గంగమ్మ భక్తి చైతన్య యాత్రను చేపట్టారు. తిరుమలకు ముఖద్వారమైన అనంతవీధిలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డెప్యూటీ మేయర్, ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష యాత్రను ఆరంభించారు. యాత్రలో పాల్గొన్న



భక్తి చైతన్య శోభాయాత్రలో అశేష భక్తజనం

వారందరికీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డెప్యూటీ మేయర్, ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి, మేయర్ శిరీష గంధం, పసుపు, కుంకుమ పూస్తూ సందడి చేశారు. భక్తులు సైతం స్వయంగా గంధం బొట్టు పెట్టుకొని, వేపాకు కొమ్మలు చేతపట్టి జై గంగమతల్లి అంటూ నినాదాలు చేస్తూ భక్తి చైతన్య యాత్రలో కదం తొక్కుతూ అమ్మవారిపై తమ భక్తి విశ్వాసాలను చాటుకున్నారు. అనంత వీధి నుంచి ఆరంభమైన ఈ గంగమ్మ భక్తి చైతన్య యాత్ర రామచంద్ర పుష్కరిణి, మహతి కళాక్షేత్రం, టౌన్ క్లబ్, ప్రకాశం రోడ్డు, గాంధీరోడ్డు, బండ్ల వీధి, హెడ్ పోస్టాఫీస్ మీదుగా అమ్మవారి ఆలయం వరకు సాగింది. వారం రోజుల క్రితం నగరమంతటా ప్రతిష్ఠించిన



కళాకారుల నృత్య ప్రదర్శన

అమ్మవారి విగ్రహాలు సైతం భక్తి చైతన్య యాత్రలో ఊరేగింపుగా సాగాయి. యాత్ర ఆద్యంతం జానపద కళారూపాల ప్రదర్శనలు, జానపద, పౌరాణిక, చారిత్రక వేషాలు, కోలాటాలు, సన్నాయి మేళాలు, డప్పుల మోతల నడుమ కోలాహలంగా భక్తి చైతన్య యాత్ర సాగింది. యాత్రకు దారి పొడవునా భక్తులు హారతులు సమర్పిస్తూ, కొబ్బరి కాయలు కొడుతూ తమ భక్తిని చాటుకున్నారు. శోభాయాత్రలో సాగుతున్న అతిథులకు పూలమాలలు వేస్తూ పుష్పవర్షం కురిపించారు. గంగమ్మ భక్తి చైతన్య యాత్రలో పాల్గొన్న భక్తులకు, కళాబృందాలకు దారిపొడవునా మజ్జిగ, వాటర్ బాటిళ్లు అందించారు. ఆలయానికి చేరుకున్న భక్తి చైతన్య యాత్రకు అర్చకులు స్వాగతం పలికి ఆహ్వానించారు. అతిథులు అమ్మవారిని దర్శించుకోవడంతో గంగమ్మ భక్తి చైతన్య యాత్ర ముగిసింది. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కార్పొరేటర్లు, టౌన్ బ్యాంక్ చైర్మన్, డైరెక్టర్లు, పార్టీ శ్రేణులు, సీనియర్ నేతలు, నాయకులు, నగర ప్రముఖులు, నగర ప్రజలు పాల్గొన్నారు.











అమ్మవారి సేవలో డెప్యూటీ మేయర్, తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్, సెల్ఫీలు దిగుతున్న అభిమానులు, శోభాయాత్రలో వివిధ కళాప్రదర్శనలు, వేషధారణలో కళాకారులు, భక్తులు

అన్నదానం



ఈశ్వరాలయంలో అన్నదానం చేస్తున్న దాతలు

పుత్తూరు: పట్టణంలోని ప్రముఖ శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం ఓంశక్తి లారీ సర్వీస్ వ్యవస్థాపకులు డి.మహేంద్రన్ జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అనంతరం భిక్షాటన ఉత్సవాన్ని నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులకు, పేదలకు మహేంద్రన్ కుమారులు అశోక్‌కుమార్, శరత్‌కుమార్ అన్నదానం వితరణ చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పట్టు పీతాంబరాలు, విశేష ఆభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి నందీశ్వరుడిపై ఆశీనులను చేశారు. వన్నెరెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు వైభవంగా సాగింది. ఈ సందర్భంగా ఇంటింటా నారికేళ కర్పూర హారతులు ఇచ్చారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని విశేష సంఖ్యలో వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.